# ఇసుక అక్రమ రవాణాతో జేబులు నింపుకొంటున్న అధికార - ప్రతిపక్షాలు

**ప్రకృతి** ప్రసాదించిన సహజ ఖనిజ సంపదల్లో ఇసుక ఒకటి. నేటి నాగరిక ప్రపంచంలో ఇసుక అవసరం ఎంతగానో వుంది. రోడ్లు, భవనాలు, అపార్ట్‌మెంట్లు, ప్రాజెక్టుల నిర్మాణం ఇసుక లేకుండా సాధ్యంకాదు. ఇతర ఖనిజాల వలనే ఇసుకపైనా దళారుల, పెత్తందార్ల, ప్రధాన రాజకీయ పార్టీ యొక్క ఆధిపత్యం కొనసాగుతున్నది. వీరి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున కొనసాగుతున్నది. కోట్లాది రూపాయలు వీరి జేబుల్లోకి చేరుతున్నాయి. పరస్పర విమర్శలతో నిత్యం తిట్టుకొనే అధికార - ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు అనేక జిల్లాల్లో కుమ్మక్కు అయి ఇసుక దందా పెద్దఎత్తున కొనసాగిస్తున్నారు. పార్టీలు వేరైనా దోచుకోవటంలో వీరి స్వభావం ఒకటేనన్న వాస్తవం వెల్లడైంది.

రాష్ట్రంలోని అనేక రేవుల్లో వరదనీటి ప్రవాహానికి ఇసుక మేటలు ఏర్పడతాయి. వరదల తాకిడికి కరకట్టలు కోతలకు గురికాకుండా ఇసుకమేటలు కాపాడతాయి. భూమిలోకి నీరు ఇంకటానికి ఇసుక ప్రధానపాత్ర పోషిస్తుంది. వరదలు, వర్షాల నీరు భూమిలో ఇంకటానికి ఇసుక నేలలు కీలకపాత్ర పోషిస్తాయి. భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడతాయి. ఇంత ప్రాధాన్యతగల ఇసుక, మాఫియాల గుప్పెట్లోకి వెళ్లింది.

1960 వరకు ఇసుక వాడకం చాలా తక్కువగా వుండేది. ఆ తర్వాత క్రమంగా దాని అవసరం పెరుగుతూ వచ్చింది. గ్రామాల పరిధిలో ఇండ్ల నిర్మాణానికి ఎటువంటి రుసుం లేకుండా ఇసుక ఉపయోగించుకొనేవారు. గ్రామ పంచాయితీల ఆదాయం పెంచే పేరుతో ఇసుక వాడకంపై రుసుం విధించేహక్కు మొదట పంచాయితీలకు ఇచ్చారు. ఆ తర్వాత పంచాయితీల పరిధిలో వేలం పాటలు నిర్వహించారు. క్రమంగా వేలంపాటలద్వారా వచ్చే సొమ్ములో వాటాల విధానం ప్రవేశపెట్టారు. దాని ప్రకారం ఆదాయంలో 65 శాతం పంచాయితీలకు, 30 శాతం మండలాలకు, 5 శాతం జిల్లా పరిషత్‌లకు కేటాయింపులు వుండేవి. ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా పాటలద్వారా వచ్చే ఆదాయాన్ని మైనింగ్ శాఖకు 15శాతం, మండల పరిషత్‌కి 50%, జడ్.పి., పంచాయితీలకు 35 శాతం కేటాయించారు. ఇది పంచాయితీల హక్కును, ఆదాయాన్ని హరించటమే. ఇసుక రీచ్‌ల వేలంలోనూ మాఫియా ఆధిపత్యం కొనసాగుతున్నది. రాష్ట్రంలో 432 ప్రాంతాల్లో ఇసుక లభ్యత వున్నా 132 ప్రాంతాల్లోనే ప్రభుత్వం వేలం పాటలు నిర్వహించింది. ప్రభుత్వంలో పలుకుబడి గలవారు, అధికారపార్టీ నాయకులు, ఎమ్.ఎల్.ఏ.లు అనేకచోట్ల వేలంపాటలు జరక్కుండా చేసి, ఆ ప్రాంతాల్లోని ఇసుకను అనధికారంగా విక్రయించి పెద్దమొత్తంలో సొమ్ము చేసుకొన్నారు. కృష్ణాజిల్లాలో 72 ఇసుక క్వారీలు వుంటే నాలుగిటికే పాటలు నిర్వహించబడ్డాయంటే ఎంత పెద్దఎత్తున లాబీ జరిగిందో అర్ధమౌతుంది.

ఇసుక త్రవ్వకాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మీటర్ల లోతుకి మించి త్రవ్వగూడదు. అంతకు మించి త్రవ్వితే భూగర్భ జలాలు తగ్గిపోతాయి. 2002 ఏ.పి. వాల్టా చట్టప్రకారం ఇసుక త్రవ్వకానికి యంత్రాలను ఉపయోగించగూడదు. దీన్ని ఇసుక మాఫియా ఉల్లంఘించి ప్రొక్లెయినర్లను యధేచ్ఛగా వాడటమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతులో ఇసుకను త్రవ్వారు. తద్వారా పెద్దఎత్తున సొమ్ము చేసుకోవటమే కాకుండా కూలీలకు పనులు లేకుండా చేశారు. వీరి అక్రమ త్రవ్వకాలకు అధికారులు ఏమాత్రం అడ్డుపడ్డా వారిపై దాడులు చేయటం, బదిలీ చేయించటం చేశారు.

వేలంద్వారా ఇసుక రీచ్‌లు చేజిక్కించుకొన్న సిండికేట్ మాఫియా, సామాన్యుడికి అందని విధంగా ఇసుక ధరను నిర్ణయించారు. గృహ నిర్మాణానికి ఇసుక తీసుకెళ్ళటానికే భయపడే పరిస్థితి ఏర్పడింది. అందుకోసం ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చి ఇసుక మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకొనని పాలకులపైనా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

అక్రమాలకు పాల్పడే వారిపైనా, అవినీతిపరులపైనా ఉక్కుపాదం మోపుతానని మాటలు చెప్పిన చంద్రబాబు, అందుకు విరుద్ధంగా వ్యవహరించాడు. తన అక్రమ ఇసుక త్రవ్వకాలను అడ్డుకొందనే కోపంతో ఆయన పార్టీ ఎమ్.ఎల్.ఏ. తాశీల్దార్ వనజాక్షిపై దాడిచేస్తే ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, అండగా నిలిచి, తాశీల్దారుని చివాట్లు పెట్టడం జరిగింది. ఇదేనా అవినీతిపై ఆయన ఉక్కుపాదం?! ఇదేవిధంగా అనేక చోట్ల తన అనుయాయులను, ఎమ్ఎల్ఏలను కాపాడుతూ వచ్చాడు.

ఇసుక అందని వస్తువుగా మారటం, దాని ధర వణుకు పుట్టించటం, ఇసుక విక్రయాల్లో అవినీతి, అక్రమాలు పెద్దఎత్తున బయటపడటం, వారి ఎడల ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఈ అసంతృప్తిని ప్రక్కదారి పట్టించేందుకు, ఇసుక పాటలను రద్దుచేస్తున్నానని, ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 'ఇసుక రీచ్‌ల ప్రాంతంలోని గ్రామాలవారే అవసరంమేరకు ఇసుకని తీసుకెళ్లాలి. ఉచిత ఇసుకవలన ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా సామాన్యుడికి ఎంతో మేలు జరుగుతుందనే అందుకు నిర్ణయం తీసుకొన్నాన'ని చంద్రబాబు గొప్పగా చెప్పుకొన్నాడు. సామాన్య ప్రజలకు కొద్ది మోతాదులోనే ఇసుక అవసరం వుంటుంది. రియల్ ఎస్టేట్‌దారులు, బిల్డర్లు, సంపన్నవర్గాలే పెద్దమొత్తంలో

ఇసుకను వినియోగిస్తారు. ఉచిత ఇసుక విధానం వారికే ఎక్కువ ప్రయోజనకరంగా వుంటుంది. చంద్రబాబు ఉచిత ఇసుక విధానంలో ఈ అంశమే ఇమిడి వుంది.

ప్రజల పేరుతో ప్రభుత్వం చేపట్టే ఏ చర్యకూడా ఆచరణలో వారికి ఉపయోగపడటంలేదు. సంపన్న వర్గాలకు, దళారులకు, అవినీతిపరులకే ఉపయోగ పడుతున్నది. ఉచిత ఇసుక విధానం అందులో ఒకటి. ఇది ఇసుక మాఫియాలకు, వారితో కుమ్మక్కు అయిన దళారులు, పాలకపార్టీలకు చెందిన వివిధస్థాయి నాయకులు పెద్దఎత్తున దందాచేయటానికి చక్కటి మార్గమైంది. పాలకపార్టీలకు చెందినవారు వారి వారి ప్రాంతాల్లో వ్యక్తిగతంగా, ఉమ్మడిగా దీన్ని కొనసాగిస్తున్నారు. ఉచిత ఇసుకని చెప్పినా సామాన్య ప్రజలు వీరికి డబ్బులు ముట్టచెప్పకుండా ఇసుక తీసుకెళ్ళే పరిస్థితి లేదు. అలా ప్రయత్నం చేసేవారికి అనేక అడ్డంకులు కల్పిస్తున్నారు. లారీలు, కూలీలు దొరక్కుండా చేస్తున్నారు.

మాఫియాలు, పాలక-ప్రతిపక్ష పార్టీల నాయకులు కుమ్మక్కు కావటంతో అనేక జిల్లాల్లో ఇసుక అక్రమ రవాణా వందలకోట్లలో జరుగుతున్నది.

**గుంటూరుజిల్లా** నుండి ప్రతిరోజు 50 లక్షల రూపాయల విలువచేసే ఇసుకను అక్రమంగా హైద్రాబాద్‌కి తరలిస్తున్నారు. జిల్లాలో కోసూరు, పెనుమాక, కొల్లిపర, కొల్లూరు, రేపల్లె ప్రాంతాల్లో అక్రమ ఇసుక త్రవ్వకాలు అడ్డులేకుండా సాగుతున్నాయి. ఇసుక క్వారీల వద్ద ఎమ్.ఎల్.ఏ. అనుచరులు మకాంవేసి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆరుటైర్ల లారీకి 3 వేలు, పది టైర్ల లారీకి 5వేలు వసూలు చేస్తూ ఇసుక లోడింగ్ చేయిస్తున్నారు. ఇందుకు భారీయంత్రాలను ఉపయోగిస్తున్నారు. **దాచేపల్లి** మండలం పొందుగుల మీదుగా పలు ప్రాంతాలనుండి ఇసుకను హైద్రాబాద్‌కి తరలిస్తున్నారు. రోజుకి 200 లారీల ఇసుక హైద్రాబాద్‌కి తరలిపోతున్నది. మైనింగ్, రెవిన్యూ, పోలీసు అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో లారీల వైపు ఎవరూ కన్నెత్తి చూడటంలేదు. **విశాఖజిల్లాలో** అధికార - ప్రతిపక్ష నాయకులు ఏకమై పెద్దఎత్తున అక్రమ ఇసుక త్రవ్వకాలకు పాల్పడుతున్నారు. నర్సిపట్నంలోని రాహనదిలో ఉత్తరవాహిని, దుగ్గాడ, మాకవరంపాలెం మండలంలో సర్పానదిలో కొండల అగ్రహారం, గొలుసు కొండ మండలంలో తాండవనదిలో చమ్మచింత, చిక్కుడుపాలెంవద్ద అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పంచాయితీ పరిధిలోని ఇసుక ర్యాంప్‌లను ఆ పంచాయితీలోని రెండు పార్టీల నాయకులు చేజిక్కించు కొంటున్నారు. కె.కోటపాడు మండలం చేడువాడలో అన్ని పార్టీలకు చెందినవారు ఇసుక ర్యాంప్‌ను కోటి రూపాయలకు వేలం వేశారు. చోడవరం ప్రాంతంలో జుత్తాడ ర్యాంప్‌ని స్థానిక అధికారపక్షానికి చెందినవారంతా కలసి 70 లక్షలు యిచ్చి వేలంలో దక్కించుకొన్నారు. గోవాడ ర్యాంపును 20 మంది టిడిపి, వైసిపీ నాయకులు 29 లక్షలకు దక్కించుకొన్నారు. ఉచిత ఇసుక విధానం రాకముందు **చోడవరం** పరిధిలో 70 లారీలు వుండేవి, ఒక దశలో కేసుల భయంతో 40 తగ్గాయి. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన తర్వాత 40 నుండి 80కి లారీల సంఖ్య పెరిగింది. ఉచిత ఇసుక విధానంతో 200లకు చేరుకొన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక త్రవ్వకాలవలన గొలుకొండ మండలం బొడ్డేరు వంతెనల వద్ద ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఎప్పలపాలెం ఆనకట్టకు ప్రమాదం పొంచి వుంది. **విజయనగరం జిల్లా**లోని గణపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో ప్రభుత్వం అనుమతించిన ఇసుక రీచ్ ఒక్కటే ఉన్నప్పటికీ అన్నిప్రాంతాల్లో అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నాయి. మక్కువ మండలం వెంకటభైరీపురం వద్ద మాత్రమే ఇసుక త్రవ్వకాలకు అనుమతి వుండగా చెముడు, మక్కువ తదితర ప్రాంతాల్లో సువర్ణముఖి, గోముఖి నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. **గణపతినగరం** నియోజక వర్గంలోని గంగచోళ్ళపెంట, కినిగే, లోగిశ, కెంగువ, పెదమానుపురం, **గంట్యాడ** మండలం మధుపాడ ప్రాంతంనుండి రోజూ వందల ట్రాక్టర్లతో ఇసుకరవాణా జరుగుతున్నది. వేగావతి నదిలో ఇసుక తీసేందుకు వీలు లేకపోయినా ట్రాక్టర్ల యజమానులు యధేచ్ఛగా త్రవ్వకాలు జరుపుతున్నారు. ఈ జిల్లాలోని ఓ మండలస్థాయి ప్రతినిధి అక్రమ ఇసుక నిల్వలుచేయటం, విశాఖపట్నానికి తరలించటంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారు. **శ్రీకాకుళం జిల్లా** నరసన్నపేట మండలం మడపాం రేవులోని ఇసుకను విశాఖకు తరలించేందుకు కేటాయించారు. అక్కడి వ్యాపారమంతా జిల్లాలోని అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధితో పాటు, స్థానిక నాయకుడి ప్రోద్బలంతో సాగుతున్నది. ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్‌కి కావాల్సిన ఇంధనంతోపాటు రోజుకి 700 చొప్పున అద్దె చెల్లిస్తారు. రోజుకి 40 ట్రాక్టర్లలో రేవునుండి ఇసుక విశాఖకు తరలిపోతున్నది. రోజూ 15 లక్షల వ్యాపారం జరుగు తున్నది. అనధికారిక ఇసుక రీచ్‌ల వెనుక ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి, అక్రమ వ్యాపారంలో ఇద్దరు ప్రజా ప్రతినిధులు కీలకపాత్ర పోషిస్తున్నారు. **పశ్చిమగోదావరి జిల్లా**లో పెద్దఎత్తున ఇసుక నిల్వలు చేపట్టారు. దీన్ని ప్రశ్నిస్తే బహుళ అంతస్తులు, సొంత నిర్మాణాలకోసమని దబాయిస్తున్నారు. జిల్లాలోని పెనుమంత్ర, మార్టేరు, పోలవరం, ఆచంట, కొవ్వూరు గ్రామాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. **తూర్పుగోదావరిజిల్లా**లోని ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు ఇసుక ప్రాంతాలు అధికార పార్టీకి చెందిన కీలకనేత కనుసన్నల్లో నడుస్తున్నాయి. ఆత్రేయపురం మండలం వేల్పూరువద్ద రాత్రిపూట అనధికార రీచ్‌ల నుంచి ఇసుక తరలిపోతున్నది. ప్రభుత్వ పనుల పేరుతో సీతానగరం మండలం వంగలపూడి నుండి వందలారీల ఇసుక తరలిపోతున్నది. అక్రమ ఇసుకరవాణాతో పెరిగిన వాహనాల రద్దీ వలన రహదార్లు ఛిద్రమౌతున్నాయి. ఎక్కువ లోతున ఇసుక త్రవ్వటంవలన సీతానగరం మండలంలో బోర్లకు నీరు అందటంలేదు. రాహనది ఇసుకపై ఆధిపత్యంకోసం జిల్లాలోని ఇద్దరు ఎమ్.ఎల్.ఏ.ల మధ్య వివాదం ఏర్పడింది. **కృష్ణాజిల్లా,** జగ్గయ్యపేట మండలం

వేదాద్రి, రావిరాల గ్రామల పరిధిలో అధికారిక ఇసుక రేవులు లేకపోయినా అనధికారిక త్రవ్వకాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. చిల్లకల్లు, బూదవాడ, జగ్గయ్యపేట, ఆటోనగర్, తక్కెళ్ళపాడు ప్రాంతాల్లో ఇసుకను నిల్వచేసి రాత్రిపూట హైద్రాబాద్ తరలిస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఇసుకరేవులపై ఆధిపత్యంకోసం ఇద్దరు ప్రముఖుల మధ్య వివాదం సంచలనంగా మారింది. **ప్రకాశంజిల్లా**లో వల్లవరం, గుండ్లకమ్మ నదిలోని పలు ప్రాంతాల్లో అనుమతిలేని ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయి. ఇసుక త్రవ్వకంవలన మణికేశ్వరంలో బావులు ఎండిపోతున్నాయి. దర్శి, అద్దంకి మార్గంలో గుండ్లకమ్మ నది ప్రక్కనే గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. చినగంజాలోని అసైన్డ్ భూముల్లో ఇసుక నిల్వలు ఎక్కువగా వున్నాయి. దీనిపై కొన్ని సంవత్సరాలుగా రెండువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ప్రస్తుతం ఒక ప్రజాప్రతినిధి సన్నిహితుడు పెత్తనం చేస్తున్నాడు. కడప, కర్నూలు జిల్లాల్లో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నది. ఈ రవాణాలో రాజకీయ నాయకుని అనుచరులు కీలకంగా వున్నారు.

రాష్ట్ర వ్యాపితంగా వివిధ జిల్లాల్లో ఇసుక రేవుల నుండి అక్రమరవాణా పెద్దఎత్తున జరుపుతూ వందల కోట్లు మాఫియాగ్యాంగ్ జేబులు నింపుకొంటున్న విషయం కోడై కూస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబుకి వినిపించటం లేదు, కనిపించటంలేదు. అక్రమ ఇసుకరవాణాలో ఆయన పార్టీవారే ఎక్కువగా వుండటం, వారి అవసరం చంద్రబాబుకి వుండటమే అందుకు కారణం. చంద్రబాబు ఉచిత ఇసుక విధానం అవినీతిపరులకు, మాఫియాలకు, రాజకీయ నాయకులకు మంచి ఆదాయవనరుగా మారింది. సామాన్య ప్రజలు మాత్రం అప్పుడు, ఇప్పుడు ఇసుకను డబ్బుపెట్టి కొనుగోలు చేయక తప్పటంలేదు. చంద్రబాబుకి ప్రజలు మేలుకన్నా తన పార్టీవారి ప్రయోజనాలే ముఖ్యమన్న విషయం, ఇసుక అక్రమ రవాణా మరోసారి వెల్లడించింది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే అక్రమ ఇసుక రవాణాను అరికట్టటం సమస్యేగాదు.

ఉచిత పథకం ఏదైనా అందరికీ వర్తింపచేయటం సరైందికాదు. సంపన్న వర్గాలకు దాన్ని మినహాయించాలి. ఉచిత ఇసుకలో కూడా ఆ మినహాయింపు వుండాలి. కోట్లు ఖర్చుపెట్టి అపార్టుమెంట్లు, పెద్దపెద్ద భవనాలు నిర్మించే వారికి ఉచితంగా ఇసుక ఎందుకు ఇవ్వాలి? వారినుండి డబ్బులు వసూలు చేయటంవలన వారికి వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. సామాన్య ప్రజల ఇండ్ల నిర్మాణానికి, ఇతర కట్టడాలకు ఉచితంగా ఇసుకను అందించాలి. మాఫియాలపైనా, అవినీతిపరులపైనా కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే ఉచిత ఇసుక ప్రయోజనం నెరవేరుతుంది.

ooooo